# పగుళ్ళు



నీలం, ఎరుపు, తెలుపు రంగుల అంచుతో ఉన్న కవరు చూడగానే తెలిసిపోయింది నాకు – ఆ ఉత్తరం జయవర్ధనేనుంచి అని! ఆప్యాయతలు, అనురాగాలు సముద్రపు అంచుల్ని దాటి ఆ ఉత్తరంలోంచి ప్రవహిస్తుంటాయి. కవరు మీద మరింత ఆకర్షణగా ఉన్న కొత్త స్టాంపులు రెండు, ముందుగా కవరు చింపి, ఆ స్టాంపుల్ని తీసి పక్కన పెట్టుకున్నాను జాగ్రత్తగా.

ఉత్తరం విప్పాను – మా ఇద్దరి మధ్యలో కుదిరిన ఒప్పందం ప్రకారం – ఈసారి జయవర్ధనే శ్రీలంకలోని సినిమాల గురించి విపులంగా వ్రాశాడు. అక్కడి సినిమాలపై తమిళుల ప్రభావం ఎంత ఉందో, భారతదేశపు తమిళ సినిమాలు ఎలాంటి వలలు విసిరి, ఉచ్చులు విసిరి, వాస్తవికతను ఎంతలా చంపేస్తున్నాయో సోదాహరణంగా రాశాడు. ఉన్నంత కొద్ది అవకాశంలో శ్రీలంక సినిమాలు సింహళ భాషలో ఎలా ముందుకు పోయే ప్రయత్నాలు చేస్తున్నాయో రాశాడు. అన్నీ చదివాను.

ఉత్తరం పూర్తి చేయబోయే ముందు నాకు మరో సంతోషవార్త అందించాడు జయవర్ధనే - వచ్చేనెల పన్నెండో తారీఖున వస్తున్నాడట!!

నాకు సంతోషం పట్టపగ్గాల్లేక పోయింది.

జయవర్ధనే... జయవర్ధనే నాకు కలం స్నేహితుడు. భారతదేశంలో ఒక ప్రముఖ పత్రికలో నా అభిరుచులు, ఆశయాలు అన్నీ కూలంకషంగా చెబుతూ నాతో కలం స్నేహం చేయగోరే వారు నా అడ్రసుకు ఉత్తరం రాయవలసిందిగా కోరుతూ ప్రకటించాను. ఫలితంగా నేనందుకున్న ఆరు ఉత్తరాలలో రెండు నేపాల్‌నుంచి, ఒకటి థాయ్‌లాండ్ నుంచి, ఒకటి శ్రీలంక నుంచి, ఒకటి మా ఊరి నుంచి, చివరిది మా ఆఫీసులోనే పనిచేసే ఒక అమ్మాయి నుంచి.

చివరి రెండు ఉత్తరాలు చింపేశాను.. నా ఊరి గురించి, నా ఆఫీసు గురించి, నాకు చెప్పేది ఏమీ ఉండదు వాళ్ళకు.

శ్రీలంక నుంచి ఉత్తరం రాసిన జయవర్ధనేకు జవాబు రాశాను... తనతో కలం స్నేహం చేయగలగటంతో నాకు సంతోషంగానే ఉంటుందనీ, ఈ కలం స్నేహం కలకాలం నిలుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాననీ రాశాను. కలం స్నేహం అంటే కేవలం ఉబుసుపోకకు ఉత్తరాలు రాసుకోవడం కాక, విజ్ఞాన సముపార్జనకు దోహదం చేసుకోవాలని, వీలైనంత సాంఘిక జీవితాన్ని ఉత్తరాల్లో ప్రతిబింబించమనీ అతన్ని కోరాను.

మిగతా ముగ్గురు విదేశీ మిత్రులకు వారితో కలం స్నేహం చేయలేకపోతున్నందుకు నా అభిరుచులు వారి అభిరుచులతో కలవవనీ, కనుక క్షమించి వదలివేయవలసినదిగా రాశాను.

వారం రోజుల తర్వాత జయవర్ధనే నుంచి ఉత్తరం వచ్చింది. నా ఎన్నిక ఎంత ఖచ్చితమైనదో నాకు అప్పుడే తెలిసింది. జయవర్ధనే మొదటి ఉత్తరంలోనే తన కుటుంబం గురించి రాస్తూ శ్రీలంకలోని టీ ప్లాంటేషన్స్ గురించి వివరంగా రాశాడు. ఇంతకాలం నాకేమాత్రం తెలీని విషయాలు ఆ ఒక్క ఉత్తరంలో ఎన్నో తెలిశాయి. కలం స్నేహానికి నిజమైన నిర్వచనం మాదేనన్న గర్వం మొదటి ఉత్తరంలోనే నాలో తలెత్తింది.

ఇక ఉత్తరాల పరంపర శరవేగంగా సాగింది... నేను నా దేశం గురించి, నా జాతి గురించి, నా సాహిత్యం గురించి రాస్తే, అతను ఆ జాతి సంప్రదాయాల గురించి, అక్కడి ఆచార వ్యవహారల గురించి సమగ్రంగా రాసేవాడు.

నాకు ఆశ్చర్యం వేసేది... నేను హిస్టరీలో పోస్ట్ గ్రాడ్యుయేట్‌ను. ఎన్నో దేశాల చరిత్రను కొంత కాలం టూకీగా, మరికొన్ని దేశాల చరిత్రలు మరికొంతకాలం విశదంగా, వేళ్ళమీద లెక్కగట్టగలిగే దేశాల చరిత్రను గుడ్డిగా ఎటునుంచి ఎటైనా చెప్పగలిగే విధంగా చదువుకొన్నాను. అయితేనేం, ఇప్పుడు నాకు జయవర్ధనే ఉత్తరాల పరంపరతో నిజమైన చదువు అంటే ఏమిటో తెలిసింది. నేను చదివిన చరిత్రలు ఎంత అసమగ్రమైనవో అదీ తెలిసింది. ప్రజల జీవితాన్ని పట్టించుకోని రాజుల చరిత్రలు, అధికార్ల దురాగతాలు.. ఇవా

చరిత్రలు? శ్రీశ్రీ చెప్పినట్లు 'రాళ్ళెత్తిన కూలీల' చరిత్రలు ఎవరు చెబుతారు మనకు పుస్తకాల్లో! నాకు జయవర్ధనే చెబుతున్నాడు.

మనం దేశం పటం చూసినప్పుడు, పటానికి క్రింద భాగాన, పట్టించుకోనవసరం లేనంత చిన్నదిగా ఉండే దేశం ఒకటి ఉంటుంది. అది చిన్న దేశం. దాన్ని పట్టించుకోనవసరం లేదనే ఊహతోనే ఉండేవాణ్ణి నేను. అయితే ఇప్పుడు ఆ దేశం ఇంత గొప్పదని నాకు తెలుస్తోంది. కానీ ఎందరికో తెలీటం లేదనే బాధ నాకు కలిగేది. కానీ ఏం చేయను?

జయవర్ధనే నాకు చేస్తున్న జ్ఞానోదయం కలుషితం కాకుండా జాగ్రత్త పడుతున్నాను. అతనిపట్ల కృతజ్ఞతతోనూ, స్నేహభావంతోనూ ఉండసాగాను.

అతను - ఇప్పుడు - మా స్నేహం ప్రారంభమయిన నాలుగేళ్ళకు స్వయంగా వస్తున్నాడు. నాకెంతో సంతోషంగా ఉంది.

అతను విదేశీయుడు. అతనికి నా జాతి జీవన విధానాల్లో ఉన్న గొప్పతనాన్నీ, ఎంతో కాలం నుంచి మా జాతి కట్టుకొన్న ప్రత్యేక పద్ధతుల గోపుర శిఖరాన్నీ, మా కళా వైభవాల్నీ, ప్రపంచం కళ్ళు తెరవక మునుపే మా జాతి ప్రపంచానికి ప్రసాదించిన వైజ్ఞానిక జ్యోతులను అతనికి నేనిప్పుడు సగర్వంగా చూపించుకోవచ్చు.

ఒక్కడంటే ఒక్కడే కావచ్చు - కానీ అతడు విదేశీయుడు - అతన్ని నా దేశ ఔన్నత్యం పట్ల అవుననిపింపజేయాలి. చాలు, ఈ జన్మ నిచ్చిన మాతృదేశానికి నేనిచ్చుకొనే ప్రతి ఇంతకన్నా ఇంకేం కావాలి??

జయవర్ధనే కోసం ఆత్రతతో ఎదురు చూస్తున్నాను.

❖ ❖ ❖

అన్నట్లుగానే జయవర్ధనే పన్నెండో తారీకున వచ్చాడు. అతనితో గడపడంకోసం, అన్ని ప్రదేశాలకు తిరిగి అతనికి చూపించడం కోసం వీలుగా ఉండేవిధంగా పదిరోజులు సెలవు తీసుకున్నాను.

అతన్ని ఆ రోజున నేను సికింద్రాబాద్ స్టేషన్‌లో రిసీవ్ చేసుకున్నాను. అతన్ని స్టేషన్‌లో గుర్తు పట్టడం పెద్ద కష్టమేమీకాలేదు. కొత్తదనం అతని ముఖంలో చోటు చేసుకొని ఉంటే, అతన్ని నేను తేలికగా అర్థం చేసుకొని, నవ్వుతూ వెళ్ళి పలకరించాను "మీరు జయవర్ధనే కదూ?"

"జయవర్ధనే! అవును" - అని క్షణం ఆగి అన్నాడు అతను "మీరు కృష్ణమూర్తి?"

అవునన్నాను.

జయవర్ధనే నా ఊహల్లో ఉన్నట్లే ఉన్నాడు. మంచి స్ఫురద్రూపి. ఆలోచనలు అతనిలో తీవ్రంగానే, అధికంగానే ఉంటాయని నాకెప్పుడో తెలుసు. ఆ ఆలోచనలకు రూపం ఇస్తే జయవర్ధనే లాగానే ఉండాలి. అలాగే ఉన్నాడు. చూడగానే అతని చిరునవ్వు ఆకట్టుకొంటుంది. స్నేహపాత్రుడుగా చేసి తీరుతుంది. నాకు మరింత సంతోషంగా ఉంది.

స్టేషన్‌లోంచి బయటకు వచ్చాము. చుట్టుముట్టిన ఆటోరిక్షాల వ్యూహాలలోంచి నెమ్మదిగా బయట పడ్డాము... "ఈ ఇల్లు దూరం, అక్కడి నుంచి మాకు తిరిగి రావటానికి ఎవరూ దొరకరు" అంటూ మరో పది రూపాయలు ఎక్కువ ఇస్తే వస్తానన్న ఆటో ఎక్కాము.

దారిలో ఎదురవుతున్న వాటి గురించి నెమ్మదిగా చెప్పసాగాను. అతను నేను చెబుతున్న వాటిని వింటూ, నేను చూపించిన వాటిని చూస్తూ, నేను పట్టించుకోని వాటి గురించి ప్రశ్నలు వేస్తున్నాడు.

రోడ్డుమీద ఉన్న 'మీది అందమైన నగరం, శుభ్రంగా ఉంచండి' అన్న బోర్డు క్రింద ఉన్న డస్ట్‌బిన్‌ను అతను చూడనే చూశాడు.

"నో పార్కింగ్" అనే సూచన ఉన్న చోటనే నిలిపి ఉన్న నాలుగు కార్లవంక చూశాడు. రోడ్లమధ్య వాహనాలను అదుపులో పెట్టవలసిన పోలీసు ఒక మూల నిలబడి పళ్ళబండి వారితో కబుర్లు చెప్పటమూ చూశాడు. అతను ఈ రోజు చూస్తున్న వాటిని నేనూ చూశాను.

అయినా పట్టించుకోలేదు. జయవర్ధనే ఇవన్నీ ఇంత క్రితమే చూసి ఉంటాడు. శ్రీలంక పెద్ద సుసంపన్న దేశం కాదు. నాకు తెలుసు. అక్కడా బీదరికం ఉంది. అక్కడా తెలివిలేమీ ఉంటుంది. అక్కడా చట్టాన్ని ఎప్పుడూ గౌరవించని వారూ ఉంటారు. ఇలాంటివి అన్ని దేశాలకూ సహజం. పైగా జయవర్ధనే మద్రాస్ నుంచి సికింద్రాబాద్‌కు రైల్లో వచ్చాడు. ఇతనికి మద్రాస్ ఎంతో, సికింద్రాబాద్ కూడా అంతే! పేర్లో తేడాయే తప్ప జీవన విధానం ఒక్కటే!!

ఆటో దిగి, సామాన్లు దింపి, ఆటో వాడికి డబ్బు ఇస్తోంటే ఆశ్చర్యంగా నాకేసి అన్నాడు "ఎందుకెక్కువ ఇస్తున్నారు?"

ఏం జవాబు చెప్పాలో తెలీక నవ్వాను.

ఇంట్లోకి రాగానే నా శ్రీమతి కుసుమను పరిచయం చేశాను. అతను ఇంటిని చూసి ఎంతో మెచ్చుకొన్నాడు...కడిగిన ఇల్లు. నీటుగా సర్దిన వస్తువులు. అప్పుడే పెట్టిన కొత్త ముగ్గులు. సన్నని సువాసనలు చల్లుతున్న అగరువత్తులు. నా ఇల్లు నాకే కొత్త అందాలతో కనపడింది.

ఆ పూట అతనికి పూర్తి ఆంధ్రా వంటకాలతో అతిథ్యం ఇచ్చాము. కొత్త ఆవకాయ, గుంటూరు గోంగూర, మజ్జిగ మిరపకాయలు, మామిడి కాయ పప్పు.... అతను అన్నీ మరీ మరి కొసరి కొసరి అడిగి వడ్డించుకొన్నాడు. అతనికి మా ఆతిథ్యం నచ్చిందని స్పష్టంగా తెలుస్తోంది.

నాకు, కుసుమకు కూడా సంతోషంగానే ఉంది... పర్వాలేదు.. ఇతన్ని మెప్పించటం నేను అనుకొన్నంత కష్టం కాదు.

ఆ తర్వాత ఇంక ఆ రోజంతా ఇంట్లోనే కాలక్షేపం చేశాం. జయవర్ధనే తెచ్చిన స్టాంపులు, నాణాలు, వ్యూ కార్డులు చూడటంతోనూ, అతనికి నేను సేకరించిన వాటిని చూపటంతోనూ కాలం గడిచిపోయింది.

రాత్రి భోజనాలు పూర్తయినాక, ఒక స్నేహితుడిని అడిగి తెచ్చిన టేప్ రికార్డర్‌లో అతనికి కొన్ని జానపద గీతాలు వినిపించాను. కుసుమను ఒప్పించి, కుసుమచేత కొన్ని ఎంకిపాటల్ని పాడించాను. వినటానికి ఇంపుగా ఉంటుందని, భక్తిరస ప్రధానమైన వేంకటేశ్వర సుప్రభాతం... అప్పుడు వినిపించకూడనిదే అయినా.. వినిపించాను. ముద్దా చిట్టిబాబు వీణ, విజయ రాఘవరావు వేణువు వినిపించి, అవన్నీ నా జాతికి కీర్తి పతాకలేనని చెప్పాను.

జయవర్ధనేకు కూడా ఆనందంగానే ఉన్నదని తెలుస్తోంది. కొన్ని కొన్ని మళ్ళీమళ్ళీ విన్నాడు. అతను స్వయంగా కొన్ని సింహళ గీతాలు పాడి వినిపించాడు.

ఆరుబయట పండు వెన్నెలలో మడత మంచాల మీద ప్రక్కలు... మాట్లాడుకొంటూనే ఎప్పుడు నిద్రలోకి జారుకొన్నామో మాకే తెలీదు.

మర్నాడు ఆదివారం. ఊళ్ళో షాపులన్నీ కట్టేసి ఉంటాయి. సగానికి పైగా నగరానికి విశ్రాంతి దినం. అందుకే జయవర్ధనేను ఎక్కడకూ – ఏ విహార స్థలాలకు తీసుకెళ్ళలేదు. మధ్యాహ్నం భోజనాలయాక, ఊళ్ళోనే ఉంటున్న నా ఇద్దరన్నయ్యల ఇంటికి, ఇద్దరక్కల ఇంటికి తీసుకెళ్ళాను. ప్రతివాళ్ళూ ఆదరంగా పలకరించటం జయవర్ధనే సంగతి ఏమిటో కానీ, నాకు సంతోషంగా ఉంది. అక్కడి నుంచి వస్తూ మా అమ్మ, నాన్నలను చూసి చాలా కాలమే అయింది కనుక, వాళ్ళున్న ఇంటికి వెళ్ళి వచ్చాం. అక్కడ మా అమ్మ, నాన్నలను చూసి జయవర్ధనే పాదాభివందనం కూడా చేశాడు. నేను నవ్వుతోంటే, అతనూ నవ్వుతూ అన్నాడు "ఇది మీ ఆచారమే కదూ?"

నవ్వాను.. తెలుగు సీమలోకి బెంగాలీ నవలలు చేసిన దాడికి ఫలితం ఇది.. ఇప్పుడు పాదాభివందనం అనేది పూర్తి తెలుగు అనవాయితీ అయిపోయిందిలా ఉంది చూస్తోంటే!

మర్నాడు జయవర్ధనేకు ఊళ్ళో ఉన్న చూడదగ్గ ప్రదేశాలన్నీ చూపించాను. నాలుగు గోపురాలతో గర్వంగా ఊరి మధ్యన ఉన్న చార్‌మినార్, ఎండిపోయిన మూసీ నదిలో అక్కడక్కడ మిగిలి ఉన్న నీటి మచ్చల్లో తన అందాల్ని చూసుకుంటున్న హైకోర్టు భవనాలు, దారిలోకి దూసుకొచ్చిన నాంపల్లి రైలు, స్టేషన్‌లో రైలు పెట్టెలు, ఆ వెనుక ఉన్న అందమైన పబ్లిక్ గార్డెన్స్, ఎదురుగా ఉన్న మార్టైర్స్ మెమోరియల్... అన్నీ వరుసగా చూపించాను.

చూపించిన వాటి గురించి రాత్రిపూట సమీక్షించుకొనే వాళ్ళం. నేను చూపించిన వాటి అందచందాలు నేను ఏకరువు పెడుతూ ఉంటే, జయవర్ధనే తనకు తోచిన వ్యాఖ్యలు చేసేవాడు. అతను అంటున్నదాన్ని బట్టి నాకు, అతనికి ఎంతో సంతోషంగా ఉందనిపించింది.

మర్నాడు జయవర్ధనే ఈ రోజు ఎక్కడికి ప్రయాణం అని అడిగాడు. చెప్పాను... "నిన్న చూడగా మిగిలిన మరికొన్ని స్థలాలు ఈ రోజు చూద్దాం" అని. జయవర్ధనే మొదట సరేనన్నాడు. కానీ మేము బయలుదేరే లోపున ఏం ఆలోచించుకున్నాడో వద్దన్నాడు.

"ప్రతిచోటా ఇలాంటి చారిత్రక స్థలాలు ఉండనే ఉంటాయి. వాటిని చూడొద్దు లెండి. మీకు అభ్యంతరం లేకపోతే ఏదైనా ఒక స్కూలుకు తీసుకెళ్ళండి, చూద్దాం, ఇక్కడ పిల్లలు ఎలా చదువుతారో?"

ఇక్కడ పిల్లలకేం ఖర్మ. ప్రపంచంలో ఎక్కడైనా పిల్లలు ఒకే రకంగా, ఒకే విధంగా చదువుతారు. ఇందులో చూడాల్సింది ఏం ఉంటుంది గనుక నిజానికి ఏమన్నా ఉంటే అది 'వినాల్సిన తేడా' – భాషలే కదా వేరు వేరు! జయవర్ధనే కోరికకు నవ్వు వచ్చింది. అయినా అతన్ని కించపర్చటం ఇష్టం లేక, నవ్వు ఆపుకొని ఇంటికి దగ్గరే ఉన్న మంచి పేరుగల ఒక క్రిష్టియన్ మిషన్ స్కూలుకు అతన్ని తీసుకెళ్ళాను. అతను ఒక వంద రూపాయల చాక్లెట్లు కొని అక్కడ పిల్లలకు పంచాడు. ఒకే రకమైన బట్టల్లో అంతా ఒకేరకంగా కనిపిస్తున్న ఆడపిల్లలు. కానీ చూడొస్తే ఎన్ని తేడాలు వీళ్ళల్లో కనిపిస్తున్నాయో నాకు ఆశ్చర్యం కలిగించింది.

జయవర్ధనే కొందరితో ఆడాడు. కొందరితో కలిసి పాడాడు. మరికొందరితో మాట్లాడాడు. అతను ఆ పాఠశాలను చూడటం అనేది తన జీవితంలో మరపురాని సంఘటన అనుకొంటున్నాడని నాకు అర్థమైంది.

స్కూలు విజిట్ అయి బయట కొచ్చాక హోటల్లో కాఫీ తాగాం. బయట కొస్తుంటే జయవర్ధనే ఇంకో వింత కోరిక కోరాడు.. "ఇక్కడ ఈ బుక్‌స్టాల్‌లో ఈ రోజే వచ్చిన మీ తెలుగు మాస పత్రిక ఒకటి, వారపత్రిక ఒకటి కొనివ్వండి."

"మీకు తెలుగు రాదు కాదా?"

"మీకు వచ్చు కదా!..." అని నవ్వి, "నేను వీటిని ఇక్కడకు వచ్చిన గుర్తుగా దాచుకుంటాను" అన్నాడు జయవర్ధనే.

ఏమిటో... ఇతని పద్ధతి అంతా తమాషాగా ఉంది. నేనూ, కుసుమా కలిసి బొంబాయి వెళ్ళినపుడు అక్కడ మార్కెట్లన్నీ తిరిగి బట్టలు, పెట్టెలు, సామాన్లు కొన్నామే తప్ప ఇలా స్కూళ్ళు, పత్రికలు అంటూ టైమ్ వృథా చేసుకోలేదు. మా అక్కా వాళ్ళు అంతే! బెంగుళూరు వెళ్ళినప్పుడు అక్కడ కెంపెగౌడ సర్కిల్‌లో ఉన్న బట్టల షాపుల్లోనే దాదాపు వారం రోజులు గడిపామని మా బావగారు తన హనీమూన్ విశేషాలు ఒకే వాక్యంలో చెప్పేశారు... ఇది ఇక్కడి ఇంటింటి కథ, ప్రతి యాత్రికుని కోరికా అదే-కొత్త ఊరిలో కొనుక్కోదగ్గని కొనుక్కోవాలనేది! కాని ఇదేమిటి, ఈ జయవర్ధనే వార పత్రికలు, మాసపత్రికలు కొనుక్కోవటం. పైగా తనకా ఆ భాషకూడా రాదు!

ఏమిటో... అనుకొంటూ అతను అడిగినట్లూ చేశాను.

అంతే, ఆ రోజు ప్రోగ్రామ్ అయిందనుకొని ఇల్లు చేరాం.

భోజనం, తాంబూలం అయ్యాక విశ్రాంతి తీసుకొంటుంటే, జయవర్ధనే అంత క్రితం కొన్న పుస్తకాలల్లో కథలు చదివి తనకు చెప్పమన్నాడు. చదివాను, మామూలు కథలే... పెద్దగా గుర్తుంచుకో దగ్గవీ లేవు. గొప్ప శిల్ప నైపుణ్యం ఉన్నవీ లేవు.

జయవర్ధనే అన్నీ విన్నాడు. అయితే ఆశ్చర్యం! ఈ సారి ఏరకమైన వ్యాఖ్యానాల్నీ జయవర్ధనే నాకు అందించలేదు.

రాత్రి గడిచి, తెల్లగా తెల్లవారాక జయవర్ధనే నాకు ఇంకో సంగతి చెప్పాడు - రాత్రి నేను గాఢ నిద్రలో ఉన్నప్పుడు నిద్రపట్టని జయవర్ధనే దాదాపు ఒక గంట సేపు అటూ ఇటూ తిరిగి వచ్చాడట! ఇరానీ హోటల్ చాయ్ తాగి, అక్కడో అయిదారు పాటలు విని ఇంటికి వచ్చానన్నాడు జయవర్ధనే. నాకు ఆశ్చర్యం కలిగింది. ఇల్లు రాత్రిపూట కనుక్కోవటంలో ఇబ్బంది కలిగే ఉంటుంది. కానీ అతను లేదన్నాడు. ఈ విషయం ఎంత ఆశ్చర్యాన్ని కలగజేసిందో దీనికి మించిన ఆశ్చర్యం నాకు కలిగించాడు అతను - ఆరోజే వెళ్ళిపోతానంటూ.

చూడాల్సినవి ఇంకా ఉన్నాయి. హైదరాబాదు గొప్ప చారిత్రక ప్రాధాన్యం ఉన్న పట్టణం. ఇది అనేక మతాలకు, అనేక రకాలైన సంస్కృతులకు కూడలి. గత వైభవాన్ని చాటిచెప్పే కట్టడాలకు, నింగిలోకి తొంగిచూస్తూ తమ అందాన్ని ప్రపంచానికి చూపే భవనాలకు ఈ

నగరం ఆటపట్టు. ఇలా ఎన్నెన్నో ఉపమానాలతో హైదరాబాద్‌ను ఎంతగానో పొగిడాను. ఇక్కడ మనుషులంతా మంచివారేనని, చెడు అన్నది కాగడా పట్టి వెతికినా దొరకదనీ, కొన్ని కోతలూ కోశాను. జయవర్ధనే అంతా విని తను ప్రయాణం అయిపోతున్నట్లుగానే చెప్పాడు. 'చూసినవి చాలు!' అని ఖచ్చితంగా చెప్పేశాడు. ఇతనికి సరైన చారిత్రక అవగాహన, చారిత్రక దృక్పథం ఏవీ లేవని అనిపించింది.

జయవర్ధనే రైలెక్కి మద్రాసుకు ప్రయాణం అయ్యాడు. స్టేషన్‌లో నేనూ, కుసుమా అతనికి వీడ్కోలు పలికాం. "వీలైనప్పుడల్లా వస్తుండండి!" అంది కుసుమ. నాకు నవ్వు వచ్చింది. "అతను ఉండేది శ్రీలంకలో, సికింద్రాబాదులో కాదు!" అన్నాను. "అయినా సరే, రాదల్చుకుంటే అదేం పెద్ద దూరం గాదు" – అంటూ కుసుమ భర్తనైన నా మాటను ఒక్కముక్కలో కొట్టిపారేసింది.

రైలు కూత కూసి కదిలింది. గార్డు జండా ఊపటం మానేసి అప్పటికి పది నిమిషాలు అయి ఉంటుంది.

❖ ❖ ❖

జయవర్ధనే వెళ్ళిన పదిహేను, ఇరవై రోజులకు కాబోలు నా పేర ఉత్తరం వచ్చింది. అది జయవర్ధనే నుంచి అని నాకు తెలుసు – బహుశా త్వరగా వెళ్ళిపోయినందుకు చింతిస్తూ రాసి ఉంటాడు. పిచ్చాడు, ఉండమంటే ఉరుకులు పరుగులుగా వెళ్ళిపోయాడు. ఇప్పుడు అనుకొని ఏం లాభం?

చదవటం ఆరంభించాను...

"మీ ఆతిథ్యం ఇంకో రెండు రోజులు అనుభవించగలిగి ఉంటే బాగుండును అని అనిపిస్తోంది నాకు, కానీ ఏం చేయను? మనసు వద్దంటోంటే కాదనలేక పోయాను.

"కానీ, పొరపాటు చేశాను. నేను శ్రీలంక వదిలి వేల రూపాయలు ఖర్చు పెట్టి రాకుండా ఉండాల్సింది. నేను వచ్చినప్పటి నుంచి జరిగిన సంఘటనలు మీకు గుర్తు చేస్తాను.. రైలు స్టేషన్‌లోంచి బయటకు రాగానే ఆటోవాడి దోపిడి ఆరంభమయింది. చదువుకున్నారు. ఊరికి కొత్తేమీకాదు. ఆటోవాళ్ళు వాళ్ళ భుక్తికోసం చేస్తున్నదే తప్పు, మనకు పెద్ద సర్వీసేమీ కాదు అది! అయినా ఆ దోపిడికి తల వంచారు మీరు. దోపిడి ఎంత జరిగితే పర్వాలేదో అన్న విషయం మీదే బేరాలు జరిగాయి. కానీ దోపిడి ఎందుకు జరగాలి అని మీరు ప్రశ్నించనే లేదు. ఆశ్చర్యంగా ఉంది కదూ! బహుశా మీకు ఇది తట్టదు – దోపిడి చేయబడటానికి మీరు అలవాటు పడిపోయి ఉంటారు!!

"తర్వాత మీరు మీ కుటుంబ సభ్యుల్ని పరిచయం చేయటం కోసం మీ అక్కల, అన్నయ్యల ఇంటికి, ఆఖరికి మీ నాన్నగారి ఇంటికి తీసుకెళ్ళారు. అంటే – ఒకే ఊళ్ళో ఉంటూ, ఒకే కుటుంబ సభ్యులై ఉండి మీకు ఎన్ని ఇళ్ళో! అలా వేర్వేరు గూడులలో ఉంటున్నారంటే... కారణాలు ఏమైతేనేం, మీ జాయింట్ ఫామిలీ పద్ధతి అంతా

పోయినట్టేకదా!... నేను మీ ఒక్క కుటుంబాన్నే చూశాను కానీ, అది జాతికి అంతా ప్రతీక అనేది నాకు తెలుసు. అన్నాన్ని అంతా ముట్టుకోనక్కరలేదనే సామెత మీకూ ఉంది!!

"మీ ఊళ్ళో చారిత్రక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. నాకూ తెలుసు. కానీ... మీకే ప్రపంచం అంటే సరైన అవగాహన లేదు. మిమ్మల్ని ఏదైనా స్కూలుకు తీసుకెళ్ళమంటే, మీరు నన్నో మిషన్ స్కూలుకు తీసుకెళ్ళారు. అందరూ ఆడపిల్లలే... అంటే వారు ప్రపంచంలో సగానికి దూరమయి బ్రతుకుతున్నారన్న మాట! మిగతా సగం ప్రపంచం గురించి వారిని మనం అంధకారంలో ఉంచుతున్నామన్నమాటే కదా! విద్య అనేది వేసుకొనే వాకిలి కాకూడదు. అది ఎప్పుడూ తెరిచే ఉండాలి!!

"ఇంక చివర్న... బయలు దేరే రోజుకు ముందు మీ ఊరి రంగు, రుచి కూడా నేను చవిచూశాను. రాత్రి మీ ఊరు ఎంత అందంగా ఉంటుందో దీపాలు చెబుతున్నాయి. రాత్రి పూట కూడా నగరం, ఎంత సజీవంగా ఉందో రోడ్ల మీద తిరిగే కార్లు, ఆటోలు చెబుతున్నాయి. కానీ... పేవ్‌మెంట్ల మీద, రోడ్ల మధ్య దీపాల క్రింద బతికే మనుషుల గురించి ఎవరు చెబుతారు? మీరు బహుశా వాటిని పట్టించుకోరు కాబోలు... మీరు ఒక్కరే అని కాదు. జాతిలో అసలు చైతన్యం అనేది ఏమయిందోనని నా బాధ.

"పైగా మీ భాషలో కొన్ని పుస్తకాలు కొని ఇమ్మంటే ఆశ్చర్యపోయారు. భాష రాదుకదా అన్నారు. భాష రాదు. కానీ మీరు చెబితే అర్థం చేసుకోగలను కదా... ఆ పనే చేశాను. గొథే ఒక చోట అన్నాడు... 'పడిపోతున్న జాతి జీవన విలువలు పడిపోతున్న సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి' అని! ఎంత గొప్ప సత్యం అది!! మీ జాతి జారిపోయి, చేరుతున్న అగాధాల అంచులన్నీ నాకు మీరు కొని పెట్టిన పత్రికల పుటల్లోంచి కనబడ్డాయి!!

"ఎంత ఊహించుకున్నాను నేను చదివిన దాన్నిబట్టి, మీరు చెప్పిన దాన్నిబట్టి, మీ ఉత్తరాలను బట్టి!! కానీ నిజానికీ, ఊహలకీ ఎంత తేడా! నేను స్నేహం కోరుకున్నది ప్రపంచంలో గర్వంగా తలెత్తి తిరుగుతోందనుకున్న జాతితో... అంతే కానీ, రెండు ముఖాలతో, తన పతనాన్ని చూపకుండా ఉన్న ముసుగులోని జాతిని కాదు – మీ కథలు, మీ జీవితం నాకు కళ్ళు తెరిపించాయి.

"క్షమించండి– ఇది మీకు నేను రాస్తున్న ఉత్తరాల్లో ఆఖరిది. శిఖరాలపై ఉండే జాతి అనుకున్న జాతి అగాధాల్లో ఎక్కడో ఉందన్న నిజం, మరింతగా కుంగిపోతున్న నిజం, విలువలు కోల్పోతోందన్న నిజం నన్ను మీతో స్నేహాన్ని కొనసాగనియ్యదు! అందుకే గుడ్‌బై...

ఉత్తరం అయిపోయింది.

ఏమిటి ఈ జయవర్ధనే బాధ?

నాకు అర్థం కాలేదు. ఎటొచ్చీ ఇకపై ఉత్తరాలు రాయడట. అదొక్కటి తెలిసింది. 'హు! కొంపేమీ మునిగిపోదు!' అనుకుంటూ కొత్త కలం స్నేహితుడి కోసం చిరునామాల వేట ఆ క్షణం నుంచే ఆరంభించాను.

– *ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక, 20.12.1978*